సాక్షి
యాదాద్రి భువనగిరి

శనివారం : 24 : మే : 2025



విరుల సాగుతో సిరులు
భువనగిరి మండలం కూనూరులో రాజమణి పది గుంటల భూమిలో పూలు సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తుంది. - 10లో



అదుపుతప్పి కారు బోల్తా
కారు అదుపు తప్పి బోల్తా కొట్టడడంతో ఒకరు మృతి చెందగా.. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. - 10లో

గరిష్టం/కనిష్టం
36°/25°

వాతావరణం
మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

భువనగిరిటౌన్: గ్రామాల్లో పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి డీపీఓలు, జెడ్పీ సీఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పనుల ప్రగతిపై సమీక్షించారు. నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ, డీపీఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పెండింగ్ పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీపీఓ సునంద, డీఆర్‌డీఓ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల తనిఖీ



బొందుగుల ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మనోహర్

రాజాపేట: మండలంలోని బొందుగుల గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీఎంహెచ్‌ఓ మనోహర్ తనిఖీ చేశారు. రోగులు, గర్భిణుల నమోదు రికార్డులు, మందుల స్టాక్‌ను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేసి ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలని వైద్యసిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు పెంచాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంఎల్‌హెచ్‌పీ మానస, ఏఎన్‌ఎం అలేఖ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు. **యాదగిరిగుట్ట రూరల్:** యాదగిరిగుట్ట పీహెచ్‌సీ, వంగపల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను డీఎంహెచ్‌ఓ సందర్శించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే ,డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

వృత్యంతర శిక్షణతో బోధన మెరుగు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఈఓ

యాదగిరిగుట్ట: ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలు మెరుగుపరుచుకునేందుకు వృత్యంతర శిక్షణ దోహదపడుతుందని డీఈఓ సత్యనారాయణ పేర్కొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా, ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రస్తుత పరిస్థితు ఉపాధ్యాయులకు అన్ని సబ్జెక్టులతో పాటు డిజిటల్ బోధన పట్ల శిక్షన ఇవ్వడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలపడుతాయన్నారు. వృత్యంతర శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు పర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ శిబిరం కోర్స్ ఇంచార్జ్, ఎంఈఓ యామిని, రిసోర్స్ పర్సన్లు నాగలింగం, బాలలక్ష్మి, నాగమణి, బాలసుబ్రహ్మణ్యం, మనోహర్, అరవింద రాయుడు, వెంకటేష్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల బదిలీలు?

- జిల్లాలో 70 మంది సిబ్బంది

సాక్షి యాదాద్రి : పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో బదిలీలకు రంగం సిద్ధమైంది. నిబంధనల ప్రకారం 30 శాతం ఉద్యోగులను మాత్రమే బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ, వంద శాతం బదిలీలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం ఎంత మంది ఉన్నారు, ఏ ప్రాతిపదికన బదిలీ చేయాలి.. తదితర అంశాలపై శనివారం సెర్ప్ ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయిలో యూనియన్ నాయకులతో సమావేశమై చర్చించనున్నట్లు తెలిసింది. కాగా కౌన్సెలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఉద్యోగులు ఇలా..
జిల్లా సెర్ప్‌లో మొత్తం 70 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో ఏపీఎంలు 23, డీపీఎంలు నలుగురు, సీసీలు 43 మంది ఉన్నారు. వీరంతా బదిలీల పరిధిలోకి రానున్నారు. జూన్ 1వ తేదీనుంచి బదిలీలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. చాలా ఏళ్ల తరువాత బదిలీలు జరుగుతుండడంతో ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వైజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ వేడకలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం సుదర్శన హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం తదితర పూజలు నిర్వహించారు.

ఉత్సవమూర్తులకు పుష్పార్చన చేస్తున్న అర్చకుడు

- బీజేపీ 'తిరంగా యాత్ర'



భారత సైన్యం పాకిస్తాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శుక్రవారం చౌటుప్పల్ పట్టణంలో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు - చౌటుప్పల్

కాంగ్రెస్.. పదవుల రేస్

ఆసక్తిరేపుతున్న పార్టీ సంస్థాగత ఎన్నికలు
- పట్టణ, మండల, బ్లాక్ కమిటీ అధ్యక్ష పదవులకు తీవ్ర పోటీ
- ఆలేరు, తుంగతుర్తిలో దరఖాస్తుల స్వీకరణ
- పలు చోట్ల 20 మందికి పైగా ఆశావహులు
- ఎమ్మెల్యేల వద్ద లాబీయింగ్



సాక్షి, యాదాద్రి: అధికార కాంగ్రెస్‌లో సంస్థాగత ఎన్నికలు ఆసక్తిని రేపుతున్నాయి. పట్టణ, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవుల కోసం పెద్ద సంఖ్యలో నాయకులు పోటీ పడుతున్నారు. ఎవరికి వారు ఎమ్మెల్యేలు, అధిష్టానం వద్ద లాబీయింగ్ చేసుకుంటున్నారు. వీరిలో ఎవరికి అవకాశం దక్కుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఈనెల 30 లోగా నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి కమిటీలకు ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంది. ఆలేరు, తుంగతుర్తిలో సమావేశాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తుండగా.. భువనగిరి, మునుగోడులో పెండింగ్‌లో ఉన్నాయి.

ఆలేరు నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి
ఆలేరు నియోజకవర్గంలో ఎనిమిది మండలాలు, రెండు పట్టణ కమిటీలకు అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంది. ఇందులో యాదగిరిగుట్ట పట్టణం, యాదగిరిగుట్ట మండలం, తుర్కపల్లి మండల అధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ మూడు చోట్ల అధ్యక్షులను నియమించే నిర్ణయాన్ని స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు వదిలేశారు. ఎమ్మెల్యే ఎవరిని నియమించినా తామంతా అంగీకరిస్తామని డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, పీసీసీ పరిశీలకుల సమక్షంలో జరిగిన సమావేశంలో నాయకులు స్పష్టం చేశారు. అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నట్లు ఎవ్వరూ పేర్లు ఇవ్వకపోవడంతో ఆ మూడు చోట్ల ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇక బొమ్మల రామారంలో 22, గుండాల 22 మంది, ఆలేరు పట్టణం, ఆలేరు మండలం, మోటకొండూరు, ఆత్మకూర్ (ఎం, రాజాపేటలో పదులసంఖ్యలో అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్నారు.

తుంగతుర్తిలో పదుల సంఖ్యలో దరఖాస్తులు
తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించి మోత్కూరు, అడ్డగూడూరు మండలాల నాయకులు, ముఖ్య కార్యకర్తలతో ఈనెల 10వ తేదీన సమావేశం ఏర్పాటు చేశారు. కానీ, గొడవ చోటు చేసుకోవడంతో దరఖాస్తుల స్వీకరణ వాయిదా పడింది. గురువారం మరోసారి సమావేశం నిర్వహించారు. అడ్డగూడూరు, మోత్కూరు మండలాల నుంచి ఆరుగురు చొప్పున దరఖాస్తు చేసుకున్నారు. మోత్కూరు పట్టణ అధ్యక్ష పదవికోసం 10 మంది దరఖాస్తులు అందజేశారు.

జోరుగా ప్రయత్నాలు
పదవుల కోసం నేతల ప్రయత్నాలు జోరందుకున్నాయి. ఎమ్మెల్యేల అండదండలు ఉన్న వారికి పదవులు దక్కే అవకాశం ఉండటంతో వారి వద్దకు చక్కర్లు కొడుతున్నారు. కాగా ఆశావహుల్లో కొత్తగా చేరిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. కాగా కూడా పదవులు ఆశిస్తూ తమ గాడ్‌ఫాదర్‌లను ఆశ్రయిస్తున్నారు. కాగా దరఖాస్తుల్లో ప్రతిపాదించిన పేర్లను పీసీసీ ఫైనల్ చేయనుంది.

భువనగిరి, మునుగోడు ఆలస్యం
భువనగిరి, మునుగోడు నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. రెండు, మూడు రోజుల్లో పూర్తి చేస్తామని డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి 'సాక్షి'తో చెప్పారు. శనివారం నుంచి భువనగిరి లేదా మునుగోడు నియోజకవర్గంలో మండలం, పట్టణవాల వారీగా సమావేశాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. కాగా భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ పట్టణాలతో పాటు అన్ని మండలాల్లో పెద్ద సంఖ్యలో నాయకులు పోటీ పడుతున్నారు.

బ్లాక్ కాంగ్రెస్ పదవులకు భారీగానే..
భువనగిరి, ఆలేరు, మునుగోడు నియోజకవర్గాల్లోని ఐదు బ్లాక్ కాంగ్రెస్ స్థానాలు ఉన్నాయి. అలేరు, యాదగిరిగుట్ట, భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవుల కోసం పెద్ద సంఖ్యలో నాయకులు పోటీపడుతున్నారు.

గ్రామ, వార్డు కమిటీలపై ప్రత్యేక దృష్టి
మండల, పట్టణ కమిటీలకు అధ్యక్షులను ఎన్నుకున్న తర్వాత గ్రామ శాఖలు, పట్టణాల్లో వార్డు కమిటీలకు అధ్యక్షులను, కార్యవర్గాలను ఎన్నుకోనున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామ, వార్డు కమిటీలకు ప్రాధాన్యం ఏర్పడింది. సారథ్య బాధ్యతల కోసం యువత ఎక్కువగా పోటీ పడుతోంది. నూతనంగా ఎన్నికైన మండల, పట్టణ అధ్యక్షులు గ్రామ, వార్డుల్లో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఆశావహుల పేర్లను తీసుకుంటారు. ఇక్కడ కూడా ఏకగ్రీవమైన వారితో పాటు పోటీపడుతున్న నాయకుల పేర్లను పీసీసీకి పంపిస్తారు.

నిధుల్లేక.. పనులు పట్టాలెక్కక..
తొమ్మిదేళ్లుగా కదలని ఎంఎంటీఎస్

- యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి భారీగా పెరిగిన భక్తులు
- సాధారణ ప్రయాణికులూ వేలల్లో..
- రవాణాపరంగా అవస్థలు
- రూ.400కోట్లతో పనులు ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన
- ప్రాజెక్టుపై చిగురిస్తున్న ఆశలు



సాక్షి, యాదాద్రి : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతోంది. ప్రధానంగా హైదరాబాద్ నుంచి నిత్యం వేలాది భక్తులు వస్తుంటారు. కానీ, సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో స్వామి సన్నిధికి చేరుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. భక్తుల సౌకర్యార్థం ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి(రాయగిరి) రైల్వే స్టేషన్ వరకు తొమ్మిదేళ్ల క్రితం ఎంఎంటీఎస్ మంజూరైనా నేటికీ పట్టాలెక్కలేదు. రూ.400 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటనతో ఎంఎంటీఎస్‌పై ఆశలు చిగురిస్తున్నాయి.

2016లో మంజూరు
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణం తరువాత భక్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని భావించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్.. ఎంఎంటీఎస్‌ను ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు పొడిగించాలని ప్రధాని మోదీని కోరారు. అలాగే రాయగిరి స్టేషన్ పేరును యాదాద్రి స్టేషన్‌గా మార్చాలని విన్నవించగా మోదీ ఆమోదించారు. యాదాద్రి రైల్వే స్టేషన్ వరకు 2016లో ఎంఎంటీఎస్ ప్రాజెక్టు మంజూరైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా మోక్షం కలగలేదు. భూసేకరణ చేయకపోవడంతో పాటు రాష్ట్రం తన వాటా నిధులు కేటాయించడం లేదని కేంద్రం.. పూర్తి నిధులతో కేంద్ర ప్రభుత్వమే ప్రాజెక్టు చేపట్టాలని రాష్ట్రం వాదులాడుకుంటూ వచ్చాయి. ఫలితంగా ఎంఎంటీఎస్ జిల్లా ప్రజలకు కలగానే మిగిలింది.

ఘట్‌కేసర్ వద్ద ఆగిన రెండో దశ పనులు
ఎంఎంటీఎస్ రెండో దశ పనులు ఘట్‌కేసర్ వద్దకు వచ్చి ఆగిపోయాయి. భూసేకరణతో పాటు నిధుల కొరత పనుల జాప్యానికి కారణంగా మారింది. రూ.400 కోట్లతో త్వరలోనే ఎంఎంటీఎస్ పనులను పట్టాలెక్కిస్తామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లోని బేగంపేట రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈసందర్భంగా స్టేషన్ ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి యాదాద్రి ఎంఎంటీఎస్‌పై ప్రకటన చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుంది



ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి రైల్వే స్టేషన్ వరకు ఎంఎంటీఎస్ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణకోసం రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుంది. యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి నిత్యం 50వేల నుంచి లక్ష మంది వరకు హైదరాబాద్ వెళ్లొస్తుంటారు. వీరిలో యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చే భక్తులే సగానికి పైగా ఉంటారు.వీరి ప్రయాణ సౌలభ్యం కోసం ఎంఎంటీఎస్ ఎంతో అవసరం. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పూర్తి సహకారం అందిస్తుంది.
–ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

ఎంఎంటీఎస్ అవసరం తప్పనిసరి
యాదగిరిగుట్ట క్షేత్రానికి పెరుగుతున్న భక్తులు, ఇతర ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా జిల్లాకు ఎంఎంటీఎస్ అవసరం తప్పనిసరిగా మారింది. ప్రాజెక్టు పూర్తయితే ప్రత్యేక లైన్ ద్వారా ఎంఎంటీఎస్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. దీంతో హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న భువనగిరికి సికింద్రాబాద్ నుంచి గంట వ్యవధిలోనే చేరుకోవచ్చు. సికింద్రాబాద్ – ఖాజీపేట సెక్షన్‌లో భువనగిరి, బీబీనగర్, ఆలేరు స్టేషన్ల మధ్య నుంచి ప్రతి రోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సాధారణ ప్రయాణికులతో పాటు విద్యార్థులు, వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, రోజు కూలీలు, యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చే వేలాది మంది యాత్రికులు ఎంఎంటీఎస్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. అంతేకాకుండా బీబీనగర్ ఎయిమ్స్‌కు వచ్చే రోగులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

రైతులకు రూ.550 కోట్లు చెల్లించాం



ముక్తాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు


- 27లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి
- కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో 48 గంటల్లోనే బిల్లులు వస్తున్నాయని, ఇప్పటివరకు రూ.550 కోట్లు జమ అయ్యాయని, మరో రూ.30 కోట్లు చెల్లిస్తే వందశాతం పూర్తవుతాయని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు, ముక్తాపూర్, రేవనపల్లి, శివారెడ్డిగూడెం, జిబ్లక్‌పల్లి, దంతూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం కుప్పలను పరిశీలించారు. ఎంత ధాన్యం కాంటా చేశారు, కేంద్రాల్లో ఎంత నిల్వ ఉందని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మిల్లుల వద్ద అన్‌లోడ్ ఆలస్యమవుతుందని తెలుసుకుని లారీ యజమానులు, మిల్లర్లతో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్ష సూచన ఉన్నందున కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హమాలీలు, కాంటాలు, లారీలను పెంచుకొని ఈ నెల 27 వరకు కొనుగోళ్లు పూర్తయ్యేలా చూడాలన్నారు. 370 కొనుగోలు కేంద్రాలకు 110 సెంటర్లలో ధాన్యం సేకరణ పూర్తయినట్లు వెల్లడించారు. 10 పెద్ద సెంటర్లు మినహా జిల్లాలోని మిగతా అన్ని కేంద్రాల్లో నాలుగు రోజుల్లో కొనుగోళ్లు పూర్తవుతాయని చెప్పారు. ఇప్పటి వరకు 2.83లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సివిల్‌సప్లై జిల్లా అధికారిణి రోజా, జిల్లా మేనేజర్ హరికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బాలమణి, ఎంఆర్‌ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శైలజ, ఏపీఎం నీరజ, ఏఈఓ నరేశ్, జూలూరు పీఏసీఎస్ చైర్మన్ అండెల లింగంయాదవ్, పోచంపల్లి పీఏసీఎస్ సీఈఓ సద్దుపల్లి బాల్‌రెడ్డి ఉన్నారు.

జీపీఓల పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

భువనగిరిటౌన్ : గ్రామ పాలన అధికారు(జీపీఓ)ల పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని, భువనగిరి పట్టణంలోని వెన్నెల కళాశాలలో సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షకు 151 మంది హాజరుకానున్నారని వెల్లడించారు. మాస్‌కాపీయింగ్‌కు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లను మూసిఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. అభ్యర్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు

ముందే వచ్చిన 'ఆరుద్ర'



రాజాపేట : మండల కేంద్రంలోని వ్యవసాయ పొలాల్లో శుక్రవారం ఆరుద్ర పురుగులు దర్శనమిచ్చాయి. తొలకరి వర్షాలకు పొలాల్లో తిరుగుతూ చూపరులను కనువిందు చేశాయి. నెల రోజుల ముందే ఆరుద్ర పురుగులు రావడం శుభసూచకమని రైతులు అంటున్నారు. పంటదిగుబడి పెరుగుతుందని, ఇది పంటలకు మిత్ర పురుగులని చెబుతున్నారు.

మహిళా సంఘాలకు కొత్త సారథులు

- 14,900 సంఘాలు, 16 మండల సమాఖ్యలకు ఎన్నికలు పూర్తి
- జూన్ 6న జిల్లా సమాఖ్య అధ్యక్షురాలి ఎంపిక



ఆలేరురూరల్ : మహిళా స్వయం సహాయక సంఘాలకు కొత్త సారథులు వచ్చారు. జిల్లాలో 14,900 సంఘాలు, 16మండల సమాఖ్యలను సెర్ప్ రూపొందించిన నూతన బైలా ద్వారా ఎన్నుకున్నారు. వలిగొండ మండల సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక ఈనెల 26న జరగనుంది. ఇక జిల్లా సమాఖ్య అధ్యక్షురాలి ఎంపిక జూన్ 6వ తేదీన నిర్వహించనున్నారు.

వీఓలు	562
మండల సమాఖ్యలు	17
మహిళా సంఘాలు	14,900
మొత్తం సభ్యులు	1,51,876

మూడు స్థాయిల్లో సంఘాలు
జిల్లా, గ్రామ, మండల స్థాయిలో స్వయం సహాయక సంఘాలు పని చేస్తున్నాయి. గ్రామస్థాయిలో ఒక్కో స్వయం సహాయక బృందానికి ఇద్దరు లీడర్లు, పాలకవర్గ సభ్యులు, గ్రామ సమాఖ్యకు అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారితో కార్యవర్గం ఉంటుంది. ఇదే తరహాలో మండల, జిల్లా సమాఖ్యలు ఉంటాయి. వీటికి ఇప్పటికే ఎన్నికలు నిర్వహించి కొత్త లీడర్లను ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణకు ఏపీఎం, సీసీలకు ఇతర సిబ్బందికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు.శిక్షణ పొందిన సిబ్బంది గ్రామస్థాయిలో కొత్త లీడర్ల ఎన్నికపై గ్రామైక్య సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు.

ఎన్నిక ఈ విధంగా నిర్వహించారు
ప్రతి స్వయం సహాయక సంఘం(ఎస్‌హెచ్‌జీ)లో 10 నుంచి 15 మంది సభ్యులు ఉన్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్ల ఎన్నికకు నిబంధనల ప్రకారం ఆసక్తి ఉన్న సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఏకగ్రీవంగా, చేతులు పైకెత్తడం, చీటీలు రాసి మద్దతు ప్రకటించడం వంటి మూడు పద్ధతులను అవలంభించారు. వీటిలో ఒక విధానం ద్వారా అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్లను ఎన్నుకున్నారు. గ్రామంలోని స్వయం సహాయం సంఘాల సభ్యుల్లో ఒకరిని గ్రామ సమాఖ్య అధ్యక్షురాలిగా, గ్రామ సంఘాల అధ్యక్షుల నుంచి ఒకరిని మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలి నుంచి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిని ఎన్నుకోనున్నారు. జిల్లా అధ్యక్షురాలి ఎంపికతో ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

రుణాల సద్వినియోగంలో వారే కీలకం
ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. చిరువ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు పాడుపు పాఠాలు అలవర్చుకుంటున్నారు. ప్రతి నెలా తప్పనిసరిగా వాయిదాల పద్ధతిన స్త్రీనిధి రుణాలను బ్యాంక్‌లో జమ చేస్తున్నారు. ఈ ప్రక్రియలో అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్ల పాత్ర ఎంతో కీలకమైనదిగా చెప్పవచ్చు.

పదవీకాలం మూడేళ్లు
నూతన కార్యవర్గాల పదవీకాలం మూడు సంవత్సరాలు ఉంటుంది.

తుది దశకు ప్రక్రియ
జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలకు కొత్త సారథులను ఎన్నుకునేందుకు పది రోజుల క్రితం మొదలైన ఎన్నికల ప్రక్రియ తుది దశకు చేరింది. 14,900 సంఘాలకు, 16 మండల సమాఖ్యలకు గాను ఇప్పటికే నూతన లీడర్లను ఎన్నుకున్నారు. జూన్ 6వ తేదీతో ప్రక్రియ పూర్తికానుంది. అనంతరం నూతన కార్యవర్గాలకు శిక్షణ ఇవ్వనున్నారు. పొదుపు, బ్యాంకు రుణాలు పొందడం, కిస్తులు చెల్లించడంపై అవగాహన కల్పిస్తారు.

పారదర్శకంగా ఎన్నికలు
జిల్లాలోని మహిళా స్వయం సహాయ సంఘాలకు ఎన్నికలు జరిగే ప్రక్రియ కొనసాగుతుంది. ఈనెలాఖరుకు ఎన్నికలు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే గ్రామ స్థాయిలో పూర్తికాగా, మండల అధ్యక్షురాళ్ల ఎన్నిక చివరి దశకు వచ్చింది. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగింది.
–పాశికంటి మల్లేశం, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్

క్లుప్తంగా

గ్రూప్-2 ఉద్యోగానికి మల్లాపురం వాసి ఎంపిక


హరిబాబు

పెద్దఅడిశర్లపల్లి : పెద్దఅడిశర్లపల్లి మండలం మల్లాపురం గ్రామానికి చెందిన నారాయణదాసు హరిబాబు గ్రూప్- 2 ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఉస్మానియా క్యాంపస్‌లో ఎల్ఎల్‌బీ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఈయన గ్రూప్ – 2 పరీక్ష రాసి 606 ర్యాంక్ సాధించాడు. దీంతో మండలవాసులు హరిబాబుకు అభినందనలు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

గుండాల : ఎదురుదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు గాయాలపాలైన సంఘటన గుండాల మండలంలోని సుద్దాల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల గ్రామానికి చెందిన అల్తాఫ్ సుద్దాల గ్రామం వైపు బైక్‌పై వెళ్తుండగా.. సుద్దాల గ్రామానికి చెందిన గూడ వెంకటేష్ వ్యవసాయ బావి నుంచి వస్తూ సబ్ స్టేషన్ ఆవరణలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరిని 108 వాహనంలో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

ఎడ్లబండిని ఢీకొని యువకుడు మృతి


నర్సింహ (ఫైల్)

మునుగోడు: ఎద్దులబండిని ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం మునుగోడులో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మునుగోడు పట్టణానికి చెందిన పందుల నర్సింహ(26) ఇళ్లకు పెయింటింగ్ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం చీకటిమామిడి గ్రామానికి తన బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఎడ్ల బండిని బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తల్లి ధనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

నాడు సాగు భూమి.. నేడు ఆధ్యాత్మిక వాడ

యాదగిరిగుట్ట: ఒకప్పుడు పచ్చని పంటలతో కనిపించే ప్రాంతమంతా నేడు ఆధ్యాత్మిక వాడగా రూపుదిద్దుకుంది. యాదగిరి కొండకు దిగువన 2016కంటే ముందు పంట పొలాలతో ఉండేది. ఇప్పుడు యాదగిరి క్షేత్ర అభివృద్ధిలో భాగంగా భక్తుల కోసం ఆధ్యాత్మిక భవనాలు నిర్మించారు. ప్రస్తుతం కొండకు దిగువన ఉత్తర దిశలో శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, లక్ష్మీ పుష్కరిణి, దీక్షా పరుల మండపం, కల్యాణ కట్ట, ఆర్టీసీ బస్టాండ్, సెంట్రల్ పార్కింగ్, ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మాణాలు చేశారు. చెట్లను, గుట్టలను, పొలాలను తొలగించి పెద్ద రోడ్లు వేసి ఆకుపచ్చని అందం సంతరించుకునేలా మొక్కలు నాటారు. ఒకప్పుడు పచ్చని పొలాలు, చెట్లతో ఉన్న ఆ ప్రాంతమంతా ఇప్పుడు ఆధ్యాత్మిక వాడగా రూపుదిద్దుకుంది.


2016కు ముందు యాదగిరి కొండకు దిగువన ఉత్తర దిశలో ఉన్న పంట పొలాలు, పచ్చని చెట్లు


యాదగిరి క్షేత్ర అభివృద్ధిలో భాగంగా భక్తుల కోసం నిర్మించిన ఆధ్యాత్మిక కట్టడాలు

చైన్‌స్నాచింగ్ కేసులో ముగ్గురు అరెస్ట్

- నిందితుల నుంచి 5గ్రాముల బంగారం, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నల్లగొండ జైలుకు ఇద్దరు, సైదాబాద్ జువైనల్ హోంకు ఒకరి తరలింపు
- వివరాలు వెల్లడించిన చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామంలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ ప్రాంతంలో సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేసి చౌటుప్పల్ పోలీసులకు అప్పగించారు. వారి నుంచి 5గ్రాముల బంగారం, మూడు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని శ్రీనివాస నగర్‌కు చెందిన ఎటికల ఫణిచందు(18), కోదాడ పట్టణం పెరిక హాస్టల్ ప్రాంతానికి చెందిన బాలుడు (17), మేడ్చల్ మల్కాజిగిరి పట్టణంలోని యాదవ్ నగర్‌కు చెందిన గుదాల తిరుమల్ (19) గతంలో వేర్వేరుగా కోదాడ, సూర్యాపేట, మేడ్చల్ ప్రాంతాల్లో చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతుండేవారు. గతంలో పోలీసులు కేసు నమోదు చేసి మైనర్లు కావడంతో సైదాబాద్‌లోని జువైనల్ హోంకు తరలించారు. అందులో వీరి ముగ్గురి మధ్య స్నేహం ఏర్పడింది. బయటకు వచ్చి, ఎవరి ప్రాంతంలో వారు నివసిస్తుండగా ఇన్‌స్టాగామ్‌లో కలుసుకుని ఫోన్ నంబర్లు తీసుకుని ప్రతిరోజు ఫోన్‌లో మాట్లాడుకునే వారు. జల్సాలకు అలవాటు పడి ఎలాగైనా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇలా ముగ్గురు కలిసి దొంగతనాలకు ప్లాన్ చేసుకున్నారు. ఈక్రమంలో మేడ్చల్‌లో ఉన్న తిరుమల్‌తోపాటు, కోదాడలో ఉన్న ఫణిచందు, మైనర్ బాలుడు బైక్‌పై ఈ నెల 21న చౌటుప్పల్‌కు చేరుకున్నారు. ముగ్గురు కలిసి బైక్‌పై హైదరాబాద్ వైపు బయలుదేరి వెళ్తుండగా మధ్యలో ఉన్న ఖైతాపురం గ్రామంలో ఒంటరిగా వెళ్తున్న వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును చోరీ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని హైవేపై సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితులు హైదరాబాద్ వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని పోలీసులు పట్టుకుని విచారించగా వారు చోరీ చేసినట్లు అంగీకరించారు. సీసీఎస్ పోలీసులు నిందితులను చౌటుప్పల్ పోలీసులకు అప్పగించారు. ఈమేరకు చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి వారి నుంచి 5గ్రాముల బంగారం, మూడు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఫణిచందు, తిరుమల్‌ను నల్లగొండ జైలుకు, మరో వ్యక్తి మైనర్ కావడంతో సైదాబాద్‌లోని జువైనల్ హోంకు తరలించినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

రాజకీయ కక్షతోనే కేసీఆర్‌కు నోటీసులు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి: ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకోవడం చూసి కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేకపోతోందని, రాజకీయ కక్షతోనే నోటీసులు ఇచ్చిందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. శుక్రవారం నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు వచ్చిన మిస్ వరల్డ్ పోటీదారులు రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని గుర్తు చేశారని తెలిపారు. తెలంగాణ దివాలా తీసి వేలకోట్ల రూపాయలు కొల్లగొట్టడం వల్లే ఈడీ కేసులో రేవంత్‌రెడ్డి అడ్డంగా ఇరుక్కుపోయారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రోజురోజుకు కుమ్ములాటలు బయటికి వస్తున్నాయన్నారు. 30 శాతం పర్సంటేజీ ఇవ్వనిదే సొంత ప్రభుత్వంలో పనులు కావడం లేదని సాక్షాత్తు కాంగ్రెస్ ఎమ్మెల్యే బట్టబయలు చేశారన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పరిపాలన వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు రేవంత్‌రెడ్డి కాళేశ్వరం కమిషన్ నోటీసు కుట్రలకు తెరలేపుతున్నారని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోళ్లు ఇప్పటి వరకు 40 శాతం కూడా జరగలేదని, కేంద్రాల వద్ద కుప్పలు వానకు తడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, కొండూరు శంకర్, తరాల బలరాం, జ్యోతి బలరాం, కోటిరెడ్డి, సుధీర్, సతీష్, దుబ్బ మధు, సత్తిరెడ్డి, ప్రకాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వాహనం బోల్తా

నాంపల్లి: మండలంలోని రాయినికుంటతండా సమీపంలో పోలీస్ వాహనం టైర్ పేలడంతో అదుపు తప్పి బోల్తా పడింది. శుక్రవారం నాంపల్లి నుంచి నేరళ్లపల్లికి వెళ్తుండగా రాయినికుంట తండా వద్ద రోడ్డుపై కంకర ఉండడంతో వాహనం టైరు పగిలి పక్కనే ఉన్న రాళ్లకు ఢీకొని బోల్తాపడింది. అందులో ఉన్న ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలు కాగా వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.


రాయిణికుంట తండాలో అదుపుతప్పి బోల్తాపడిన పోలీస్ వాహనం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


బుచ్చిరెడ్డి(ఫైల్)

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండల పరిధిలోని అల్లాపురం గ్రామానికి చెందిన గూడూరు బుచ్చిరెడ్డి (59), పక్కీరు అల్వాల్‌రెడ్డి పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో తాళ్లసింగారం క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న తమ గ్రామస్తుడి వివాహానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈక్రమంలో బాలాజీ దేవాలయం దాటిన తర్వాత వలిగొండ వైపు వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న అల్వాల్‌రెడ్డి, వెనుక కూర్చున్న బుచ్చిరెడ్డి ఎగిరి రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో ట్యాంకర్ బుచ్చిరెడ్డి పైనుంచి వెళ్లడంతో శరీర భాగాలు ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. అల్వాల్‌రెడ్డికి గాయాలుకాగా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా

- ఒకరు మృతి.. ఏడుగురికి తీవ్రగాయాలు
- దైవ దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తుండగా ఘటన


గాయపడిన రామస్వామి


ధ్వంసమైన కారు

బీబీనగర్: దైవ దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తుండగా కారు అదుపు తప్పి బోల్తా కొట్టడడంతో ఒకరు మృతి చెందగా.. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం బీబీనగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌కు చెందిన చేగూరి రామస్వామిగౌడ్(60), లక్ష్మి దంపతులు, వారి కోడళ్లు భూమిక, మనీష తోపాటు వీరి పిల్లలైన అక్షిత్, అక్షయ్, శ్రీయాంక, సహస్రలతో కలిసి గురువారం సాయంత్రం కారులో యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి దర్శనానికి వచ్చారు. శుక్రవారం ఉదయం స్వామివారి దర్శనం చేసుకొని తిరిగి మొయినాబాద్‌కు బయలుదేరారు. బీబీనగర్‌కు రాగానే జాతీయ రహదారిపై గల ఫ్లైఓవర్ సమీపంలో కారు అదుపు తప్పి సర్వీస్ రోడ్డుపైకి పల్టీ కొట్టింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసం కాగా అందులో ఉన్న ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను బయటకు తీశారు. నేషనల్ హైవే అంబులెన్స్‌లో వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా రామస్వామి, లక్ష్మితోపాటు, మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రామస్వామి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రమాదానికి గురైన కారులో నలుగురు ఐదేళ్లలోపు చిన్నారులే ఉన్నారు.

బైక్‌ను తుఫాన్ ఢీకొట్టడంతో ఒకరు మృతి

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. నల్లగొండ జిల్లా చందంపేటకు చెందిన కృష్ణ(32) గురువారం అర్ధరాత్రి బైక్‌పై రంగారెడ్డి జిల్లా యాచారం నుంచి మాల్ వైపు వెళ్తున్నాడు. మార్గ మధ్యలో చింతపట్ల గేట్ వద్ద తుఫాన్ వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో కృష్ణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

స్వర్ణగిరి క్షేత్రంలో తిరువీధి ఉత్సవసేవ


తిరువీధి ఉత్సవసేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం సాయంత్రం తిరువీధి ఉత్సవసేవ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన సేవ, సుదర్శన నరసింహ హవనం, నిత్య కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం సుమారు 3వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, పద్మావతి అమ్మవారికి కుంకుమార్చన సేవ జరిపించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు


ఆత్మహత్యకు యత్నించిన హరీష్

అర్వపల్లి: మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన రాయపర్తి హరీష్ పది రోజుల కిందట తన భార్య మౌనికతో గొడవపడ్డాడు. ఆమె పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటానని పురుగుల మందు డబ్బాతో శుక్రవారం గ్రామ శివారులోని గుట్ట ఎక్కి తన బంధువులకు వీడియోకాల్ చేసి చెప్పాడు. దీంతో అతడి బంధువులు, గ్రామస్తులు గుట్ట వద్ద వెతకగా ఆచూకీ దొరకకపోవడంతో 100నంబర్‌కు డయల్ చేశారు. అర్వపల్లి ఎస్ఐ బాలకృష్ణ, పోలీస్ సిబ్బంది పసుపులేటి సైదులు, మణికుమార్‌లు గుట్ట వద్దకు వెళ్లి ఫోన్ లొకేషన్ ఆధారంగా వెతికి హరీష్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకుని బంధువులకు అప్పగించారు. హరీష్ ప్రాణాలు కాపాడిన పోలీసులకు బంధువులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై ఐదు గేదెలు మృతి

రామన్నపేట: విద్యుదాఘాతానికి గురై ఐదు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన శుక్రవారం రామన్నపేట మండలంలోని శోభనాద్రిపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శోభనాద్రిపురం గ్రామానికి చెందిన జక్కిలి ఐలయ్యకు చెందిన మూడు పాడిగేదెలు, జక్కిలి పద్మ, పోలేపల్లి సత్తయ్యలకు చెందిన ఒక్కో గేదె గ్రామశివారులోని పెసరు అనంతరెడ్డికి చెందిన పొలంలో మేత మేస్తుండగా తెగిపడి ఉన్న విద్యుత్ తీగ వాటికి తగిలింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. ఒక్కో గేదె విలువ రూ 1.50లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

విరుల సాగుతో సిరులు


రాజామణి సాగు చేస్తున్న మల్లె పూల తోట

- పూల తోట సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- మరో ఐదుగురికి ఉపాధి చూపుతున్న కూనూరు గ్రామానికి చెందిన రాజామణి

భువనగిరిటౌన్ : పూల సాగు చేస్తున్న మహిళా రైతుకు సిరులు కురుపిస్తోంది. ఆధ్యాత్మిక ప్రాంతం కావడంతో ఇటు మహిళా రైతుకు, అటు వ్యాపారులకూ లాభాల పంట పండుతోంది. భువనగిరి మండలంలోని కూనూరు గ్రామంలో మహిళా రైతు పాశం రాజామణి తనకున్న పది గుంటల విస్తీర్ణంలో పూల సాగు చేపట్టింది. సాధారణ పంటలతో పాటుగా పూల సాగుపై మక్కువ చూపింది. కనకాంబరం, మల్లె, బొండు మల్లె, జాజిమల్లె పూల తోట వేసింది. ప్రతిరోజు రూ.3వేల వరకూ వస్తాయని చెబుతోంది. తనతో పాటు మరో ఐదుగురికి ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొంటుంది.

సొంత వ్యాపారం చేద్దామనుకున్న ప్రయత్నంలోనే పూల తోట సాగు

తన భర్త కూలీ పనికి పోవడం ఇష్టం లేకపోవడంతో పాశం రాజామణి సొంత వ్యాపారం పెట్టే ఆలోచనలో భాగంగా విజయవాడ నుంచి కేవలం 10 పూల మొక్కలు తెచ్చి పెట్టింది. వచ్చిన పూలు అమ్మగా కొంత ఆదాయం రావడంతో మరికొన్ని మొక్కలు తెప్పించి తమ కున్న పది గుంటల భూమిలో నాటారు. ప్రస్తుతం 250 మొక్కలు వరకు సాగు చేస్తోంది. ఇందులో బొడ్డుమల్లె, సన్నజాజి, మరికొన్ని కనకాంబరాల మొక్కలు ఉన్నాయి. అంతే కాకుండా పూలదండలు అల్లుతున్న మహిళలకు కిలో రూ. 120నుంచి రూ.200ల వరకు ఇస్తుండడంతో వారికి ఉపాధి దొరుకుతోంది. చిరు వ్యాపారులు భువనగిరి, యాదగిరిగుట్టతో పాటు, వివిధ పెళ్లిల సీజన్‌లో ఆర్డర్లపై పంపిస్తోంది.

పూల సాగుతో అధిక లాభాలు



సీజన్‌లో పూల సాగుతో మంచి లాభాలు వస్తాయి. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం. ఈ సాగుతో వచ్చే ఆదాయంతో నా ముగ్గురు కుమారులను ఉన్నత చదువులు చదివించాను. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరో ఎకరంలో సైతం పూల తోట సాగు చేస్తా.

– పాశం రాజామణి, కూనూరు, భువనగిరి మండలం

ప్రేమించిన యువతికి వివాహమైందని..

- మనస్తాపంతో ఉరేసుకున్న యువకుడు


మధు (ఫైల్)

భువనగిరి: ప్రేమించిన యువతి వివాహమైందని మనస్తాపానికి గురైన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన భువనగిరి మండలంలోని తుక్కాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసాల అయిలయ్య, భాగ్యమ్మ కుమారుడు మధు(23) రోజుమాదిరిగా ఈ నెల 22న రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. తల్లి భాగ్యమ్మ ఉదయం లేచి ఇంట్లో గదులను శుభ్రం చేసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో మధు నిద్రించే గది తలుపు తెరిచింది. కుమారుడు ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికులు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులకు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రేమించిన యువతి వివాహం కావడం తోపాటు, అప్పులు ఎక్కువ అయ్యాయనే బాధతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు తెలిపారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత


వాహనంలో తరలిస్తున్న పశువులు

మునగాల : మండల శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున కోదాడ నుంచి హైదరాబాద్‌కు ఓ వాహనంలో పశువులను తరలిస్తుండగా మండల పోలీసులు తనిఖీలు నిర్వహించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి టీఎస్ 29 టీ 3458 నంబర్ గల అశోక్ లేలాండ్ వాహనంలో పది పశువులు (8ఆడ, రెండు మగ)ను హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా తనిఖీలు చేపట్టి వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా కోదాడ పట్టణానికి చెందిన వేముల అనిల్, వాహనం డ్రైవర్ షేక్ అసీఫ్, క్లీనర్ సయ్యద్ బాబులపై కేసు నమోదు చేసి పట్టుబడిన పశువులను హైదరాబాద్‌లోని జియాగూడ గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.